క్లుప్తంగా

మామిడి రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: రైతులంటే సీఎం చంద్రబాబునాయుడుకు ఎప్పుడూ చిన్నచూపేనని వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ విమర్శించారు. మామిడి కాయల లోడును జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద దించుకోవడానికి దళారులు రైతుల నుంచి వందల్లో వసూలు చేస్తున్నారని, అసలే గిట్టుబాటు ధర లేక నష్టాలతో కుదేలైన రైతన్నలకు ఈ దోపిడీ మరింత బాధకు గురిచేస్తోందన్నారు. మరోవైపు టోకెన్లు పొందిన రైతులు ఫ్యాక్టరీ లోపల వెళ్లి వెలుపలికి రావాలంటే రోజులు పడుతోందన్నారు. మామిడి కాయలు అమ్మేందుకు వచ్చిన రైతులు వారం రోజులుగా జాతీయ రహదారిపై తిండీతిప్పలు లేకుండా నిరీక్షిస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా మామిడి రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతులు శాపనార్థాలు పెడుతున్నారన్నారు.

చిత్తూరు హైరోడ్డు విస్తరణ షురూ..!



కట్టమంచిలో ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన స్థలాన్ని విస్తరిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్: చిత్తూరులో హై రోడ్డు విస్తరణ పనులు ఒక్కో దశను దాటుకుని ముందుకు వెళుతోంది. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డును వంద అడుగులుగా విస్తరించాలని పాలకులు, అధికారులు సంకల్పించారు. అయితే హైరోడ్డులో ఉన్న భవనాలకు నష్టపరిహారం ఇచ్చి, విస్తరణకు పూనుకోవాలని పలువురు ఇప్పటికే అల్టిమేటం ఇచ్చారు. మరికొందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వంద అడుగుల రోడ్డుకు స్థలాన్ని అప్పగిస్తున్నారు. గురువారం కట్టమంచిలోని కొందరు భవన యజమానులు కలిసి వంద అడుగుల రోడ్డు విస్తరణకు తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. దీంతో ఎలాంటి ఆర్థికభారం లేకుండా కార్పొరేషన్ అధికారులు ఆ స్థలాన్ని విస్తరణకు ఉపయోగిస్తున్నారు.

పుట్టుకతో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పుట్టుకతో వచ్చే అనారోగ్య సమస్యలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించి..వాటి నివారణకు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి తెలిపారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం మానసిక వికలాంగులకు న్యాయపరమైన సేవలు అనే విషయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచిత న్యాయసేవలు, అవసరమైన వారికి ఆర్థిక సహాయం, పునరావాస కేంద్రాలకు తరలింపు, హక్కుల గురించి ఆమె వివరించారు. డీఎం అండ్‌హెచ్ఓ. సుధారాణి మాట్లాడుతూ మేనరికపు వివాహాల కారణంగా చాలా మంది పిల్లల్లో మానసిక, శారీరక సమస్యలు వస్తున్నాయన్నారు. డీసీహెచ్ఎస్ పద్మాంజలి మాట్లాడుతూ గర్భిణీ సమయంలో ప్రతి ఒక్కరూ మానసిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే మానసిక రుగ్మతలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని ఆమె వివరించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 53 మంది రోగులు శిబిరంలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకారి.. సికిల్ సెల్

అభంశుభం తెలియని చిన్నారులను అరుదైన వ్యాధి పట్టి పీడిస్తోంది. పుట్టుకతోనే వారికి సోకిన సికిల్‌సెల్ వ్యాధి జీవితాంతం వెంటాడుతోంది. శరీరానికి అవసరమైన రక్తాన్ని అందకుండా చేసి ఒక్కో అవయవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఫలితంగా ఆడుతూ పాడుతూ తిరగాల్సిన చిన్నారులు కుప్పకూలిపోతున్నారు. ఏ పనీ చేతగాక చిక్కిశల్యమవుతున్నారు. ఇలాంటి వారికి గత ప్రభుత్వం రూ.10 వేల పెన్షన్ ఇచ్చి ఆదుకుంది. ఈ వ్యాధిపై జాడలను పసిగట్టేందుకు అధికారులు జిల్లా వ్యాప్తంగ సర్వే చేపడుతున్నారు.

పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



- చిన్నారులకు సోకుతున్న అరుదైన వ్యాధి
- రక్త కణాల్లో అడ్డంకులు
- అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్న వైనం
- జిల్లాలో కొనసాగుతున్న సర్వే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మనిషిలో సాధారణంగా ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయి. రక్తనాళాల ద్వారా ఈ కణాలు శరీరమంతా ప్రయాణించి వివిధ అవయవాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తాయి. కొంతమందిలో జన్యుపర కారణాల వల్ల ఎర్ర రక్తకణాలు గుండ్రంగా గాకుండా కొడవలి ఆకారంలోకి మార్పు చెంది ఉంటాయి. దీనినే సికిల్ సెల్ వ్యాధిగా వైద్యులు పిలుస్తారు. ఈ వ్యాధి ఉన్న వారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్, మరొకటి మామూలుగా ఉంటే అలాంటి వారిని సికిల్‌సెల్ క్యారియర్లు ఉంటారు. వీరికి మామూలుగా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు. వివాహం చేసుకున్న దంపతులు ఇద్దరికీ ఇలాంటి లక్షణాలు ఉంటే వారికి జన్మించే పిల్లలకు రక్తకణంలోని రెండు జన్యువులూ వంపు తిరిగి ఉంటాయి. అలాంటి పిల్లలకు పుట్టుకతోనే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సాధారణ రక్త కణాల జీవిత కాలం 120 రోజులైతే సికిల్ రక్తకణాల జీవిత కాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే. ఇవి నశించిపోయేంత వేగంగా కొత్త ఎర్ర రక్తకణాలు ఉత్పత్తి కాకపోవడంతో ఈ వ్యాధి ఉన్నవారు రక్తహీనతకు గురవుతారు. సికిల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండడం వల్ల సన్నటి రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందడం తగ్గిపోతుంది. ఈ వ్యాధిగ్రస్తులు తగిన చికిత్స తీసుకోక పోతే 15 ఏళ్లలోపు మరణించే అవకాశం ఉంది. ఇలాంటి అరుదైన వ్యాధి ఉన్న వారికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి నెలా రూ.10వేల ప్రత్యేక పెన్షన్ ఇచ్చి ఆదుకున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

- దీర్ఘకాలం పాటు కామెర్లు ఉంటాయి
- రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండడం, కాళ్లు, చేతుల వేళ్లు వాపుతో వంపు తిరిగి ఉండడం, ప్లీహం వాచిపోయి ఉండడం, నీరసం, తిమ్మిర్లు, డార్క్ ఐస్, చర్మం ముడతలు పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- శిశువుకు ఆరు నెలల వయసు వచ్చే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. వయసు పెరిగే కొద్దీ లక్షణాలు కనిపిస్తాయి.
- ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో శరీరంలో ఏదైనా ఒక భాగంలో తీవ్రమైన నొప్పి కలుగుతుంది.
- కౌమార దశలో ఉన్నవారు, పెద్దవారు దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతూ ఉంటారు.

వ్యాధినిర్ధారణ పరీక్ష..

ఈ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక రక్తపరీక్ష ఖరీదు చాలా తక్కువలోనే ఉంటుంది. రక్తనమూనాను సోడియం మెటాబైసల్ఫేట్‌లో కలిపి మైక్రో స్కోప్ కింద చూస్తే రక్తకణాలు గుండ్రంగా ఉన్నాయా..?, వంపు తిరిగి ఉన్నాయా తెలుసుకోవచ్చు. తద్వారా ఆ వ్యక్తికి సికిల్‌సెల్ వ్యాధి ఉందో లేదో నిర్ధారిస్తారు. జన్యుపరమైన ఈ వ్యాధికి ఇప్పటివరకు మందు లేదు. సికిల్ సెల్ క్యారియర్లుగా గుర్తించి, వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు.

సర్వే జరుగుతోంది..



సికిల్ సెల్ వ్యాధి ఉంటే వారికి పుట్టే పిల్లలకూ ఈ వ్యాధి వస్తుంది. కొడవలి ఆకారంలో ఉండే రక్తకణాల వల్ల శరీరంలో రక్త సరఫరా సరిగ్గా జరగక ఇబ్బందులు వస్తాయి. రక్త నాళాల్లో విపరీతమైన నొప్పులు, వాంతులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి. ఇలాంటి వారికి ఫ్లూయిడ్స్ ఎక్కించి అవసరమైన మందులు అందజేస్తాం. వైద్యులు సూచించిన మేరకు రెగ్యులర్‌గా ఈ వ్యాధికి మందులు వాడాలి. బోన్ మ్యారో మార్పిడి శస్త్రచికిత్స చేస్తే పూర్తిగా నయం అయ్యే అవకాశం ఉంది. దీనిపై సర్వే చేస్తున్నాం. పరీక్షలు జరుగుతున్నాయి. **– వెంకటప్రసాద్, జిల్లా సికిల్‌సెల్ నోడల్ అధికారి, చిత్తూరు**

సికిల్ సెల్‌కి తగిన చికిత్స..



సికిల్ సెల్ వ్యాధి తల్లిదండ్రుల్లో ఇద్దరికీ ఉంటే వారికి పుట్టే బిడ్డకు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గర్భం దాల్చక ముందే బిడ్డకు రాకుండా తల్లికి ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తాం. గర్భం దాల్చాక వస్తే బిడ్డకు వచ్చే అవకాశం ఉందా ? అని తెలుసుకోవడానికి ఉమ్మనీరు పరీక్షకు పంపిస్తాం. ప్రసవం తర్వాత బిడ్డకు అవసరమైన పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తాం. గర్భిణిగా ఉన్నప్పుడు సికిల్ సెల్ ఉంటే ఆమెకు నెలలు నిండక ముందే బిడ్డ పుట్టే అవకాశం ఉంది. బిడ్డ కూడా బరువు తక్కువగా జన్మించే అవకాశం ఉంది. **– సుధారాణి , డీఎంఅండ్‌హెచ్, చిత్తూరు**

కూటమి నిర్వాకంతోనే మామిడి నష్టాలు

- విజయానందరెడ్డి విమర్శ



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం నిర్వాకంతోనే మామిడి రైతులు నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయ కర్త విజయానందరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిల్వ చేరిన పల్ప్ వల ప్రస్తుతం మామిడి కొనుగోలు మందగించిందన్నారు. వీటిపై రైతులకు మద్దతుగా తాను మాట్లాడితే ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తప్పుపట్టడాన్ని ఖండించారు. కనీస అవగాహన లేకుండా ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తోందని డైవర్షన్ పాలిటిక్స్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. రోజుల తరబడి కాయల లోడును అమ్ముకోవడానికి ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నా రైతులకు అవస్థలు తప్పడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేక, కష్టపడి పండించిన పంటను అమ్మకోలేక రైతులు మామిడి కాయలను పారేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు పలు మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయని, ఆ రైతులకు ఎంత బాధ ఉంటుందో ప్రజాప్రతినిధిగా గురజాల ఆలోచించాలన్నారు. ఫ్యాక్టరీ ధర, ప్రభుత్వ సబ్సిడీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. టోకెన్ విధానం పెట్టినా అది అధికార పార్టీ నాయకుల సిఫార్సుదారులకు తప్పితే రైతులకు ఉపయోగపడటం లేదనేది గుర్తెరగాలన్నారు. ప్రభుత్వం పటిష్ట చర్యలు, సరైన విధానం పాటించడంలో విఫలం కావడం వల్లే మామిడి రైతులు నష్టాల పాలవుతున్నారన్నారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక



ప్రభుత్వాసుపత్రిలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చౌడేపల్లె: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎంఎన్ కంటి ఆసుపత్రి (చెన్నై) సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్లకు 12 మందిని ఎంపికచేసినట్లు డాక్టర్ పవన్‌కుమార్ గురువారం తెలిపారు. శిబిరంలో 32 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. శస్త్ర చికిత్స చెన్నై ఆసుపత్రిలో ఉచితంగా చేయించి స్వగ్రామాలకు వారిని చేరుస్తామన్నారు. కార్యక్రమంలో రహంతుల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్నిపథ్'పై అవగాహన



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎయిర్‌ఫోర్స్ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : యువత అగ్నిపథ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కార్పోరల్ సందీప్, సురేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో యువతకు అగ్నిపథ్ పథకం పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అగ్నివీర్ పథకానికి 17 1/2 నుంచి 21 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న యువత అర్హులన్నారు. 2022 నుంచి దేశ వ్యాప్తంగా ఈ పథకం అందుబాటులోకి వచ్చిందన్నారు. సాయుధ దళాలలో పనిచేయాలనుకునే యువతకు నాలుగేళ్ల పాటు అవకాశం కల్పిస్తారని చెప్పారు. పాల్గొన్న యువతకు ఎయిర్‌ఫోర్స్ అధికారులు సంధించి.. సమాధానాలు రాబట్టారు. కచ్చితమైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయం కోసం ధర్నా!



పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ

కుప్పం: స్థల వివాదానికి సంబంధించి పోలీసులు ఓ వర్గానికే కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తూ మరో వర్గానికి చెందిన మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని జరుగు గ్రామానికి చెందిన మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితులు మాట్లాడుతూ జరుగు గ్రామంలో నివాస గృహాల మధ్య మూడు సెంట్ల స్థలం కోసం అదే గ్రామానికి చెందిన శీనప్ప భార్య శాంతమ్మ, రామప్ప భార్య శాంతమ్మ గొడవ పడ్డారని తెలిపారు. దీంతో ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. అయితే పోలీసులు ఒక వర్గం వైపే ఉన్నారని ఆరోపించారు. అర్బన్ ఎస్ఐ కలుగజేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో మహిళలు శాంతించారు .

బదిలీల్లో నిబంధనలు సడలించాలి

పలమనేరు: గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలను సడలించాలని ఏపీ సచివాలయాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీఎస్ మురళీనాథ్ విజ్ఞప్తి చేశారు. గురువారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

బండకిందపల్లెలో విత్తనాల పంపిణీ నిల్!

- గగ్గోలు పెడుతున్న రైతులు



బండకిందపల్లె రైతు సేవా కేంద్రం కార్యాలయం

రొంపిచెర్ల: మండలంలోని బండకిందపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలు ఇంతవరకు అందలేదు. పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లె గ్రామ పంచాయతీలను బండకిందపల్లె గ్రామ సచివాలయంగా ఎంపిక చేశారు. ఈ ఏడాది బండకిందపల్లె గ్రామ సచివాలయానికి 210 బస్తాల వేరుశనగ విత్తనాలు వచ్చాయి. అయితే సచివాలయ పరిధిలో రైతులు సుమారు 1,350 మంది ఉన్నారని 210 బస్తాల వేరుశనగ విత్తనాలు ఇస్తే ఎలా పంపిణీ చేయాలని సచివాలయ ఇన్‌చార్జి అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. గత సంవత్సరం 450 బస్తాలు ఇచ్చారని ఈ సంవత్సరం 210 బస్తాలు ఇస్తే ఎవరికి ఇవ్వాలో అర్థం కాక విత్తనాల పంపిణీ నిలిచి పోయింది. దీనికితోడు రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి నరసింహులు నెల రోజులుగా టైఫాయిడ్ జ్వరంతో సెలవుపై వెళ్లారు. దీంతో ఇక్కడ సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ ఆగిపోయింది. మండల వ్యవసాయాధికారులైనా చర్యలు తీసుకుని విత్తనాలు పంపిణీ చేమాలని రైతులు కోరుతున్నారు.

చికెన్ సెంటర్లు, హోటళ్లలో తనిఖీలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు: పట్టణంలోని పలు హోటళ్లు, చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత, నాణ్యత, ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై స్థానిక మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. పలు చికెన్ దుకాణాల వద్ద కంపు కొడుతూ అపరిశుభ్రంగా ఉన్నట్టు గుర్తించారు. కొన్ని హోటళ్ల వద్ద మరీ అధ్వాన్నంగా ఉందని గమనించారు. ఇక ఎటుచూసినా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగతున్నట్టు గమనించి కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంమీద పది దుకాణదారులకు రూ.5వేల జరిమానా విధించినట్టు స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. తనిఖీలలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరవనం.. ఇసుకాసురమయం..!

- అటవీ భూమిలోనూ ఇసుక తవ్వకాలు
- కౌండిన్య నదిలో నీటిలోనూ ఇసుకను తోడేస్తున్నారు
- జీడిమాకులపల్లెలో రేయింబవళ్లూ తోడివేత
- పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

పలమనేరు: కౌండిన్య నదిలో ఇటీవల వర్షాలకు నీరు చేరడంతో ఇసుకాసురుల కన్ను నది పక్కనున్న అటవీశాఖ నగరవనంపై పడింది. నదికి ఆనుకుని నగరవనం పడమటి వైపు జేసీబీలతో సొరంగాల తరహాలో మరీ ఇసుకను తోడేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది సాక్షిగా ఈ అక్రమాలు సాగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇసుకాసురుల దెబ్బకు నగరవనం ఫెన్సింగ్ సైతం కూలింది. అక్కడున్న వృక్షాల వేర్లు తేలి కూలే స్థితికి చేరాయి. గంగవరం మండలంలోని జీడిమాకులపల్లెకు చెందిన పదుల సంఖ్యలో ఇసుక స్మగర్లు జేసీబీ, ట్రాక్టర్లతో నిత్యం వందలాది లోడ్ల ఇసుకను తోడి తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు హైవే మీదుగా నాగమంగళంలో వెళ్లి పట్టణంలోకి వస్తున్నా ఇదే మార్గంలోని ఆర్డీఓ, తహసీల్దార్, ఇరిగేషన్, పోలీసు శాఖలు అసలు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్ శాఖ పరిధిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నా దృష్టి సారించిన పాపానపోవడం లేదు. జీడిమాకులపల్లెలోనే 80 ఇసుక ట్రాక్టర్లు, పది జేసీబీలు 60మంది కూలీలకు పైగా రేయింబవళ్లూ అనే తేడా లేకుండా ఇసుకను తోడేస్తున్నారు. రాత్రిపూట ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసి నదిలోని ఇసుకను గుట్టలుగా పోసి, నీరు ఇంకిపోయాక పగటిపూట దాన్ని తరలిస్తున్నారు. ఈ విషయమై నగరవనం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సురేంద్రను వివరణ కోరగా.. వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న నగరవనంలో ఇసుకాసురుల దెబ్బకు వేళ్లు తేలి కూలే స్థితికి చేరిన వృక్షాలు